క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ల నియామకం

తిరుపతి కల్చరల్ : గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గూడూరు పట్టణ అధ్యక్షుడిగా బి.శ్రీనివాసులు, రూరల్ మండలానికి విజయకుమార్‌రెడ్డి, కోట- సంపత్‌కుమార్‌రెడ్డి, చిట్టమూరు- శ్రీనివాసులరెడ్డి, చిల్లకూరు- యద్దల మధుసూదన్‌రెడ్డి, వాకాడు మండలానికి ఎస్.ఉదయశేఖర్‌రెడ్డిని నియమిస్తున్నట్లు పేర్కొంది.

స్కూల్‌గేమ్స్‌లో 'ప్రగతి' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కిషోర్

కోట : నెల్లూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీల్లో ఆర్చరీ విభాగానికి సంబంధించి కోటలోని శ్రీప్రగతి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు పాఠశాల చైర్మన్ పసుపులేటి కిషోర్ శుక్రవారం తెలిపారు. అండర్-14లో 7వ తరగతి విద్యార్థిని నిషిత ప్రథమస్థానం సాధించగా, అండర్-17లో 9వ తరగతి విద్యార్థి చరణ్ తృతీయస్థానం దక్కించుకున్నట్లు వెల్లడించారు. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. అనంతరం సత్తా చాటిన విద్యార్థులను అభినందించారు.

ఎన్‌బీకేఆర్‌లో స్వామినాథన్‌కు సంతాపం


నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కోట : విద్యానగర్ ఎన్‌బీకేఆర్‌లో శుక్రవారం మెకానికల్ ఇంజినీరింగ్ అసోసియేషన్ వారు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ హరిత విప్లవ పితామహుడిగా స్వామినాథన్ పేరుపొందారని కొనియాడారు. హెచ్‌ఓడీ విక్రమ్‌కుమార్ మాట్లాడుతూ అధిక దిగుబడి అందించే వరి వంగడాలను స్వామినాథన్ సృష్టించారన్నారు. కార్యక్రమంలో చింతా రవీంద్రరెడ్డి, కిషంధర్ పాల్గొన్నారు

రౌడీయిజం చేస్తే సహించం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నాయుడుపేటటౌన్ : పట్టణంలో రౌడీయిజం చేస్తే సహించే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ హెచ్చరించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ స్థానిక పాగొట్టం కాలనీలో పేదల ఇళ్ల నిర్మాణాలను కొందరు అడ్డుకుంటూ భయాందోళనలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు కాలనీవాసులతో కలిసి కమిషనర్ శ్రీనివాసరావు, సీఐ నరసింహారావు, తహసీల్దార్ రాజేంద్రకు ఫిర్యాదు చేశారు. కాలనీ భూములకు సంబంధించి కోర్టులో వ్యాజ్యం నడుస్తోందని, అందులోకి ఎవరూ ప్రవేశించకూడదని తహసీల్దార్ స్పష్టం చేశారు. అయితే పేదలకు న్యాయం చేసేందుకు తమ వంతు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వైభవంగా చండీ యాగం


యాగం నిర్వహిస్తున్న పండితులు

చిల్లకూరు : తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం వైభవంగా చండీ యాగం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి నాడు చండీ యాగం నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ఉభయకర్తలు మైలాంగం బాలాజీ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నవీన్‌కుమార్, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖర రెడ్డి, సాయికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

వాకాడు : మండలంలోని గొల్లపాళెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు జాలాది కిషోర్, మేరీ సునీత దంపతులు తమ కుమారుడు అబ్రహం జోసఫ్ పాల్ సంస్మరణార్థం 38 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించారు. సీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, ఉప సర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్, వాకాడు లూథరన్ చర్చి సంఘ కాపరి ఎన్.ప్రశాంత్‌బాబు, అజయ్‌కుమార్, వాకాటి రవి, బి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.





పెనుశిల క్షేత్రోత్సవం

పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారం మహాపూర్ణాహుతితో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీ సమేతంగా నృసింహస్వామివారు శేషవాహనంపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించారు. అనంతరం అలంకారమండపానికి వేంచేపు చేశారు. ఉత్సవర్లకు అర్చకులు కనులపండువగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. శ్రీవారి వైభవాన్ని తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. - రాపూరు

షణ్ముఖుని బ్రహ్మోత్సవం



మల్లాం గ్రామంలోని శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేడుకగా ఫలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి భక్తుకు దర్శనభాగ్యం కల్పించారు. అర్చకుడు భానుప్రకాష్‌శర్మ తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ క్రమంలో రాత్రి స్వామివారిని నందివాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిల్లకూరు సాయికుమార్ రెడ్డి పర్యవేక్షించారు.

- చిట్టమూరు

ప్రజారోగ్యానికి 'సురక్ష'

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం చుట్టింది. ప్రతిష్టాత్మకంగా పథకం అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. శుక్రవారం ఈ మేరకు వైద్య సిబ్బంది ద్వారా ఇంటింటి సర్వే చేపట్టింది. ప్రతి గృహానికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేసేలా చర్యలు తీసుకుంది. సమగ్రంగా సమాచారాన్ని యాప్‌లో నమోదు చేయిస్తోంది. అనంతరం నిర్వహించనున్న మెడికల్ క్యాంపుల్లో గుర్తించిన రోగులకు పూర్తి ఉచితంగా చికిత్సలందించడంతోపాటు మందులు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేసింది.

- ముమ్మరంగా ఇంటింటి సర్వే
- పకడ్బందీగా వైద్య పరీక్షలు
- సమగ్రంగా సమాచారం సేకరణ


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రాపూరు : మండలంలో ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా సాగుతున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ లింగమూర్తి తెలిపారు. శుక్రవారం సుమారు 3,250 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు.. శనివారం గోనుపల్లె గ్రామంలో ఆరోగ్య సురక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. అలాగే మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఎంపీడీఓ అప్పాజీ సమీక్షించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంఈఓలు శ్రీనివాసులు, జిలానీ, డాక్టర్ అంజలి, ఏఈ సర్దార్, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చిల్లకూరు : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే సదుద్దేశంతో ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీడీఓ నిర్మలా దేవి తెలిపారు. మండలంలోని ఓడూరు సచివాలయంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య పర్యవేక్షకులు రవికుమార్, సీహెచ్‌ఓ సుదీప్తి ప్రియాంక, ఆరోగ్య కార్యకర్త రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి జమీర్‌బాషా పాల్గొన్నారు.

సైదాపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీ మీసాల వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని రామసాగరం సచివాలయంలో సురక్ష సర్వేపై సమీక్షించారు. వైద్యులు జనార్దన్, శ్రావణి, ఏఓ పురుషోత్తం శివకుమార్ పాల్గొన్నారు. ఈక్రమంలోనే మండలంలోని చాగనణం, రాజుపాళెం,చీకవోలు, గంగదేవిపల్లి, అనంతమడుగు, కొమ్మిపాడులో వైద్య సిబ్బంది సర్వే చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి యాప్‌లో నమోదు చేశారు.

దొరవారిసత్రం : మండలంలోని తనియాలి, పూలతోట, నెలబల్లి సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులపై సర్వే చేపట్టారు.

నేడు తాళ్వాయిపాడులో..

పెళ్లకూరు : మండలంలోని తాళ్వాయిపాడు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల కార్యక్రమం కొనసాగుతుందన్నారు.


సైదాపురం : మాట్లాడుతున్న ఎంపీడీఓ

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని ఆబాక, కోటపోలూరు-1 , మంగానెల్లూరు, మంగళంపాడు , కోటపోలూరు-2 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించి వైద్య పరీక్షలు చేపట్టారు. 104 వాహనాల ద్వారా మందులు పంపిణీ చేశారు.

ఓజిలి మండలంలో 5 నుంచి..

ఓజిలి: మండలంలో అక్టోబర్ 5 నుంచి జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ తెలిపారు. అత్తివరం, వజ్జవారిపాళెం, పెదపరియ, ఓజిలి ఆరోగ్య కేంద్రాలల్లో ముమ్మరంగా ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు వివరించారు.

గూడూరురూరల్ : ప్రణాళికాబద్ధంగా పనిచేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం గూడూరులోని ఆర్డీఓ కార్యాలయంలో వైద్యాధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సురక్ష పథకం కింద ఇప్పటికే క్షేత్రస్థాయిలో వ్యాధిగ్రస్తులను గుర్తించి టోకెన్లు అందించినట్లు వెల్లడించారు. శనివారం నుంచి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్సలందించాలని స్పష్టం చేశారు. గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించి మందులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేయాలని సూచించారు. కంటి వెలుగు కింద అవ్వాతాతలకు కళ్లజోళ్లు అందజేయాలని కోరారు. సమీక్షలో ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎల్‌డీఓ వాణి, వైద్యాధికారులు పాల్ జాన్సన్, వంశీకృష్ణ, శివానీ పాల్గొన్నారు.


రాపూరులో జగనన్న ఆరోగ్యసురక్ష ప్రారంభిస్తున్న అధికారులు


సూళ్లూరుపేట : వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది


రాపూరులో ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

'జగనన్నకు చెబుదాం'పై స్పందన

దక్కిలి:(బాలాయపల్లి) : మండలంలోని కడగుంట దళితవాడలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు శుక్రవారం ఎంఈఓలు వెంకటేశ్వర్లు, ప్రదీప్ గ్రామానికి చేరుకుని స్థల పరిశీలన చేపట్టారు. జగనన్నకు చెబుదాంలో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు జేసీ ఆదేశాలు జారీ చేశారని అధికారులు వెల్లడించారు. దళితవాడలో 22మంది విద్యార్థులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు నివేదికను డీఈఓకు పంపనున్నట్లు వెల్లడించారు.

అప్పు చెల్లించలేదని ఫిర్యాదు

చిట్టమూరు : మండలంలోని మొలకలపూడికి చెందిన ఓ వ్యక్తి అప్పు తీసుకుని తిరిగి చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నాడని పలువురు బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సొమ్ము తిరిగి ఇవ్వమంటే బెదిరింపులకు దిగుతున్నాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో కొందరు గ్రామస్తులు తనను బెదిరిస్తున్నారని సదరు వ్యక్తి సైతం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

రక్తదాన శిబిరం

రాపూరు : స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం ఆయుష్మాన్ భారత్ హెల్త్ మేళాలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యాధికారి నర్మదాదేవి మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు రక్తదాన శిబిరం కొనసాగుతుందన్నారు. అనంతరం దాతలకు సర్టిఫికెట్లు అందించారు.

చెరువు భూమిలో సాగుకు వినతి

చిట్టమూరు : మండలంలోని ఆరూరు చెరువు లోతట్టు భూముల్లో వరి సాగు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని డీటీ నిరంజన్‌కు శుక్రవారం గ్రామస్తుకు వినతిపత్రం అందజేశారు. తమ వల్ల ఆయకట్టు రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, ప్రభుత్వం ఎప్పుడు కోరిత అప్పుడు భూములు స్వాధీనం చేసేస్తామని పేర్కొన్నారు.

విజన్ బిల్డింగ్‌పై శిక్షణ

దొరవారిసత్రం : స్థానిక ఇందిరా క్రాంతి పథం కార్యాలయంలో వీఓఏ, గ్రూపు లీడర్లకు విజన్ బిల్డింగ్‌పై శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ మేరకు ఏపీఎం పద్మావతి అవగాహన కల్పించారు. రుణాలు చెల్లింపు, రికార్డుల నిర్వహణపై మహిళలకు అవగాహన అవసరమని ఆమె తెలిపారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ

పెళ్లకూరు : మండలంలోని తాళ్వాయిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు శుక్రవారం చెన్నైకి చెందిన ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని వితరణగా అందించారు. క్లబ్ ప్రతినిధులను పాఠశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పెసల సుశీల, షమ్మారోహిత్, ప్రియావివేక్, ప్రధానోపాధ్యాయులు దొరస్వామి పాల్గొన్నారు.

4,384 మందికి వాహన మిత్ర లబ్ధి

గూడూరురూరల్ : గూడూరు ఆర్డీఓ కార్యాలయం పరిధిలో 4,384 మందికి ఐదో విడత వాహనమిత్ర లబ్ధి చేకూరినట్లు ఆర్డీఓ ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈమేరకు వాహన మిత్ర లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10వేలు వంతున ప్రభుత్వం జమ చేసినట్లు వెల్లడించారు.

భూ హద్దులు చూపించాలని వినతి

చిల్లకూరు : కడివేడు గ్రామంలో సుమారు 25 ఏళ్ల క్రితం తమకు పంపిణీ చేసిన భూములకు హద్దులు చూపించి న్యాయం చేయాలని స్థానిక దళితులు కోరారు. శుక్రవారం ఈమేరకు తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందించారు. సర్వే నంబర్ 960 నుంచి 963 వరకు సుమారు 75 ఎకరాలు తమకు ఇచ్చారని, వాటివలో బయటి ప్రాంతాలకు చెందిన వారు సాగు చేసుకునేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ రీసర్వే సమయంలో భూ హద్దులు నిర్ణయిస్తామని హామీ ఇచ్చారు.

అసైన్డ్ చట్ట సవరణపై నేడు సదస్సు

సైదాపురం : అసైన్డ్ భూముల చట్ట సవరణపై శనివార గూడూరులో సదస్సు నిర్వహించనున్నట్లు ఏబికేఎం ఎస్ జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య తెలిపారు శుక్రవారం ఆయన మాట్లాడుతూ సదస్సును విజయవంతం చేసేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఉద్యాన పంటల పరిశీలన

సైదాపురం : మండలంలోని రామసాగరం, కొమ్మిపాడు గ్రామాల్లో సాగు చేస్తున్న ఉద్యాన పంటలను శుక్రవారం పొదలకూరు ఉద్యానశాఖాధికారి ఆనంద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం విరివిగా రాయితీలు అందిస్తోందని తెలిపారు. ఈమేరకు రైతులు ముందస్తుగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వరగలి విద్యార్థులు

చిల్లకూరు : నెల్లూరులో నిర్వహించిన స్కూల్ గేమ్స్‌లో వరగలి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయని మరుధ్వతి తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు వి.చక్రి, కె.మణికంఠను అభినందించారు. ఎంపీటీసీ సభ్యుడు దారా కోటేశ్వరరావు చేతులమీదుగా జ్ఞాపికలు అందించారు.


వెంకటగిరి నియోజకవర్గ సమీక్షలో విజయసాయిరెడ్డి, వేదికపై నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు


గూడూరు నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి, వేదికపై ఎమ్మెల్యే వరప్రసాదరావు, రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, సిపాయి సుబ్రమణ్యం

ప్రగతి భవనాలు ప్రారంభం

చిల్లకూరు : తూర్పు కనుపూరులో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు శుక్రవారం ప్రారంభించారు. సుమారు రూ.80 లక్షలతో భవనాలను నిర్మించినట్లు వెల్లడించారు. అనంతరం రైతులకు సబ్సిడీపై ఎరువులు, పచ్చరొట్టె విత్తనాలను అందించారు. కార్యక్రమంలో గూడూరు ఏఎంసీ చైర్‌పర్సన్ ఓడూరు యమునమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య, వైస్ ఎంపీపీ పొలుబోయిన చెంగయ్య, సర్పంచ్‌లు అన్నాడిశెట్టి నాగమ్మ, రావుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

ఇద్దరి నిందితుల అరెస్ట్

గూడూరు రూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకు నుంచి బెంగళూరుకు బస్సులో గంజాయిని రవాణా చేస్తున్న ఒకరితో పాటుగా, బస్సులో నాటు సారా తీసుకెళుతున్న మరో వ్యక్తిని సెబ్ అధికారులు పట్టుకుని అరెస్టు చేసినట్లు సీఐ విజయకుమార్ శుక్రవారం తెలిపారు. రెండో పట్టణంలోని సెబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఆ వివరాలు వెల్లడించారు. చిల్లకూరు మండలం, బూదనం టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై వేకువ జాము నుంచి తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ ప్రయివేటు బస్సులో 2 కిలోల గంజాయిని తీసుకుని బెంగళ్లూరుకు చెందిన ఎం.కిరణ్ అనే యువకుడు వెళ్తుండగా అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అలాగే మరో బస్సులో ఒడిశాకు చెందిన జగకుమారి అనే వ్యక్తి వద్ద లీటర్ సారా ఉండడాన్ని గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్ఐ శేషమ్మ, హెడ్ కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, సిబ్బంది రమేష్, వీఎన్.ప్రసాద్, కృష్ణా, బాషా, ఆనంద్ బాబు, రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.


గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సెబ్ అధికారులు

1న పరిసరాల పరిశుభ్రతకు శ్రమదానం

గూడూరురూరల్ : స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా అక్టోబరు 1వ తేదీన గంటపాటు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు శ్రమదానంలో పాల్గొనాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం గూడూరు పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి స్వచ్ఛతాహి సేవా పోస్టర్ విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 15 నుంచి స్వచ్ఛతాహి సేవా సాగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సాయి, ముని, ఇమ్రాన్, జమళ్ల వాసు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పొనకా దేవసేనమ్మ

75 ఎకరాల్లో ఆటోనగర్

గూడూరురూరల్ : పట్టణ సమీపంలోని జగనన్న లేఔట్ వద్ద సుమారు 75 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఆటోనగర్‌కు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఆటోనగర్ ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడుతుందన్నారు. గూడూరు ప్రజల చిరకాల కోరికను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆటోనగర్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీఐఐసీ అధికారులతో మాట్లాడి ఆటోనగర్‌కు స్థలం సేకరించినట్లు వెల్లడించారు. దీంతో వాహనాల రిపేరు దుకాణాలు, స్క్రాప్ అంగళ్లను ఆటోనగర్‌కు తరలించనున్నట్లు వివరించారు. ఇక్కడ నుంచి వరగలి క్రాస్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. పేదరికమే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.


ఆటోనగర్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, అధికార ప్రతినిధి నాశిన నాగులు, నాయకులు బత్తిని విజయకుమార్, అన్నం మురళి, అజీజ్‌ఖాన్, అల్తాఫ్, తూపలి లక్ష్మి, ఎస్ఐ బ్రహ్మ నాయుడు పాల్గొన్నారు.

సమగ్రత చాటేలా విద్యార్థుల ర్యాలీ

కోట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మన మట్టి- మన నేల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ మస్తానయ్య,హెచ్‌ఎం సురేంద్రబాబు పాల్గొన్నారు.

దక్కిలి : మండలంలోని కందలవారిపల్లెలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు జాతీయ జెండా చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయని ఉప్పలూరి సరళకుమారి పాల్గొన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ-2 జగదీష్ బాబు పలు పాఠశాలలకు మట్టి కలశాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయని ఎస్.రత్నప్రభ, సర్పంచ్ శనగా వేమక్క, ఎంపీటీసీ సభ్యులు మొలకల వెంకటరమణమ్మ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఓజిలి: మండలంలోని చిలమానుచేనులో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు షమీర్, రమేష్, చల్లా ప్రసాద్, జరీనా, మురళీకృష్ణ పాల్గొన్నారు.

పెళ్లకూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన మట్టి- మన దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకరయ్య పాల్గొన్నారు.


కోట జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ

గూడూరురూరల్ : పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మన మట్టి- మన దేశంలో భాగంగా విద్యార్థులు మహనీయుల వేషధారణతో అలరించారు. దేశ నాయకులతో చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. పిల్లలకు వివిధ పోటీలు ఏర్పాటుచేసి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సనత్‌కుమార్, ప్రధానోపాధ్యాయని భారతి పాల్గొన్నారు.

చిట్టమూరు : స్వాంతంత్ర్య సమరయోధుల చిత్రపటాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పార్థసారధి, స్కూల్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

హ్యాకథాన్‌లో 350 మంది ఎంపిక

గూడూరురూరల్ : పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 350 మంది విద్యార్థులు తదుపరి రౌండ్‌కు ఎంపికైనట్లు డైరెక్టర్ మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 210 మందిని ఎంపిక చేసి ఫైనల్ రౌండ్‌కు పంపనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీలు ధనుంజయ, రాజయ్య, సురేష్, శిరీష, ఏఓ రామయ్య పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులు

విద్యార్థులకు యూనిఫామ్

నాయుడుపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం విన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చెన్నై విస్టీరియా ప్రతినిధులు యూనిఫామ్ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు పెసల సుశీల మాట్లాడుతూ గత 10 ఏళ్లుగా కళాశాల విద్యార్థులకు తోడ్పాటు అందిస్తున్నామన్నారు. ప్రిన్సిపల్ మధుసూదన్ వర్మ, పారిశ్రామికవేత్త పెసల రాజగోపాల్‌గుప్తా, క్లబ్ సెక్రటరీ ప్రియావివేక్ పాల్గొన్నారు.


యూనిఫామ్ అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు